ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
శనివారం | ఆగస్టు 22, 2026 | సంపుటి : 7 | సంచిక : 73 | పేజీలు : 2

## ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతికి సీఎం సంతాపం

**హైదరాబాద్, ఆయుధం:** ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మరణించారని తెలిసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్న తనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి గారు దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని అన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తుచేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని అన్నారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. భగవంతుడు ఆమెకు శాంతి చేకూర్చాలని ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి గారు సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సీఎం రేవంత్ అమెరికా
# పర్యటన రద్దు

- లండన్ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్
- రాజకీయ కోణంలో యూఎస్ పర్యటన అనుమతి నిరాకరించిన కేంద్రం
- విస్మయం వ్యక్తం చేసిన సీఎం కేంద్రంపై గౌరవంతో హైదరాబాద్‌కు పయనం



**హైదరాబాద్, ఆయుధం:**

కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం యూకే, అమెరికా దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉండగా, రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించబడిందని కేంద్రం తెలియజేసిన నేపథ్యంలో రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. విధివిధానాలు, ప్రోటోకాల్ ప్రకారం ముఖ్యమంత్రి యూకే, అమెరికా పర్యటనకు రాష్ట్రం కేంద్ర అనుమతి కోరింది. తొలుత యూకే పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. అధికారిక ప్రతినిధి బృందం యూకేకు చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతికి, అలాగే వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు "రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం" పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని, బోస్టన్, అమెరికా పర్యటనకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. కేంద్ర నిర్ణయంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ, "ఈ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యా సంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న మన యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవి" అని పేర్కొన్నారు. "దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని నేను ఎప్పుడూ విశ్వసిస్తాను" అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. వివిధ విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలను అధికారుల బృందం కొనసాగించాలని, ఆయా విశ్వవిద్యాలయాలతో అవసరమైన అన్ని అవగాహన ఒప్పందాలు (MoUs), భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. "హైదరాబాద్ ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ తదితర విశ్వవిద్యాలయాల ఏర్పాటు హైదరాబాద్‌ను అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్... ఒక పాఠశాల ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నిరూపించింది. అక్కడి నుంచి ప్రపంచంలోని గొప్ప టెక్ నాయకుల్లో కొందరు రూపుదిద్దుకున్నారు. ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి కార్పొరేషన్లు, వాటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆకర్షించగలిగింది. ఇప్పుడు ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి, 21వ శతాబ్దపు మన ప్రగతి ప్రయాణానికి శక్తినిస్తాం" అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పేర్కొన్నారు.
షెడ్యూల్ ప్రకారం యూకేలో ముఖ్యమంత్రి గారు ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర సంస్థలను సందర్శించి, వాటి ప్రతినిధులతో సమావేశాలు కొనసాగించనున్నారు.
నైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో సమావేశమై, తెలంగాణతో భాగస్వామ్యాలను అధికారికంగా ఖరారు చేసేందుకు ఈ పర్యటనలో ప్రయత్నిస్తారు. "హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం, ప్రయత్నం. ఒక సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లేదా ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎల్ఎస్ఈ వంటి ప్రపంచ స్థాయి సంస్థల నుంచి విద్య, సర్టిఫికేషన్ పొందగలగాలి. ఎందుకంటే చాలామంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకున్నారు. కానీ నేను ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలను భారత్‌కు తీసుకురావాలని అభిలషిస్తున్నాను" అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## చంతయ్యపల్లిలో సమస్యల పరిష్కారానికి చర్యలు

- **గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి కాలువల ద్వారా నీరు అందిస్తాం**
- **చంతయ్యపల్లి స్టేజి నుంచి గ్రామం వరకు నెల రోజుల్లో రోడ్డు పూర్తి చేస్తాం**
- **ఆయిల్‌ఫామ్ సాగుతో రైతులకు అధిక ఆదాయం**
- **మంత్రి పొన్నం ప్రభాకర్**

**హనుమకొండ, ఆయుధం:** హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం చంతయ్యపల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామ ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలు, వివిధ వర్గాల నుంచి వచ్చిన వినతులను మంత్రి స్వీకరించి, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### చంతయ్యపల్లి గ్రామ ప్రగతి నివేదిక

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చంతయ్యపల్లి గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు ప్రయోజనాలు అందుతున్నాయని అధికారులు వివరించారు. గ్రామంలో 68 పెన్షన్ల ద్వారా రూ.18.8 లక్షల లబ్ధి అందుతోంది. రైతు (మిగతా 2లో..)



## తండ్రి లేని విద్యార్థినికి వాక్ ఫౌండేషన్ ఆర్థిక సాయం

**వరంగల్, ఆయుధం:** వరంగల్ తూర్పు నియోజకవర్గం 23వ డివిజన్ కొత్తవాడకు చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త గాజర్ల విజయ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చి వారి కూతురు గాజర్ల దేవన్షు చదువు నిమిత్తం వాక్ ఫౌండేషన్ ద్వారా వారికి 10,000/ రూపాయిల ఆర్థిక సహాయం అందజేశారు. డాక్టర్ వన్నాల వెంకటరమణ వాక్ ఫౌండేషన్ ద్వారా చేస్తున్న సామాజిక సేవలు, వర్ధన్నపేట మండలంలోని పలు గ్రామాలలో నిరుపేద కుటుంబాలకు ప్రతినెల వారికి బియ్యం పంపిణీ, వైద్య శిబిరాలు, పరీక్షల సమయంలో విద్యార్థులకు పరీక్షకు సంబంధించిన మెటీరియల్ పంపిణీ, నిరుపేద విద్యార్థులకు స్కూలు ఫీజు కొరకు ఆర్థిక సహాయం అందించుట లాంటి సేవ కార్యక్రమాలు చేబడుతున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీష్ షా, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముంద్రాతి వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు విప్ప సుధాకర్, సీతా నాగరాజు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు వావిలాల శోభారాణి, మహిళా మోర్చా BJP నాయకురాలు గాజర్ల సుశీల, కె.మౌనిక, తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన నగరమే లక్ష్యం..

- **జిడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న**
- **పారిశుద్ధ్యంపై క్షేత్రస్థాయిలో కమిషనర్ నిశిత పరిశీలన**



**వరంగల్, ఆయుధం:** నగరంలో పారిశుద్ధ్య నిర్వహణను మరింత పటిష్టం చేసి, ఎంపిక చేసిన డివిజన్లను మోడల్ డివిజన్లుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ నగరంలోని పలు డివిజన్లలో ఆకస్మికంగా క్షేత్రస్థాయి పారిశుద్ధ్య తనిఖీలు నిర్వహించి, పారిశుద్ధ్య సిబ్బంది పనితీరు, ఇంటింటి చెత్త సేకరణ, తడి-పొడి వ్యర్థాల విభజన, రోడ్లు, ఖాళీ ప్రదేశాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. 9వ డివిజన్‌ను పూర్తిస్థాయి మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి వ్యర్థాలను తప్పనిసరిగా వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి ఇంటి వద్దనే వ్యర్థాల విభజనపై అవగాహన కల్పించి, ప్రజల్లో ప్రవర్తనా మార్పు తీసుకురావాలని తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేందుకు రెసిడెంట్స్ అసోసియేషన్లు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజా సంఘాలను భాగస్వామ్యం చేయాలని (మిగతా 2లో..)



## వరంగల్ జిల్లాలో 22(ఎ) భూముల
# వివాదాన్ని పరిష్కరించాలి

### - బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ డిమాండ్

**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా వ్యాప్తంగా 22(ఎ) నిషేధిత భూముల జాబితాలో చోటుచేసుకున్న తప్పిదాలు, అక్రమ చేర్పులపై సమగ్ర విచారణ జరిపించి, బాధిత రైతులు, భూ యజమానులకు న్యాయం చేయాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో అడిషనల్ కలెక్టర్‌ను కలిసి 22(ఎ) భూముల సమస్యపై సమగ్ర వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 22(ఎ) నిషేధిత భూముల జాబితాలో తప్పిదాలు జరిగినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అంగీకరించిన నేపథ్యంలో, వరంగల్ జిల్లాలోనూ ఈ జాబితా రూపకల్పనలో జరిగిన అక్రమాలు, అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. గ్రామం, మండలం, సర్వే నంబర్ వారీగా 22(ఎ) భూముల పూర్తి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ కాలం నుంచి ఇప్పటివరకు 22(ఎ) జాబితాలో జరిగిన చేర్పులు, తొలగింపులపై పూర్తి ఆడిట్ నిర్వహించాలని, ధరణి/భూ భారతి సహా డిజిటల్ భూ రికార్డుల్లో జరిగిన మార్పులపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలని అన్నారు. తప్పుగా నిషేధిత జాబితాలో చేర్చిన ప్రైవేటు భూములను గుర్తించి వెంటనే తొలగించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. 22(ఎ) జాబితాలో భూముల భారీ పెరుగుదల వెనుక కుట్ర, అధికార దుర్వినియోగం లేదా అక్రమ ఆర్థిక లబ్ధి ఉందా అనే కోణంలోనూ విచారణ జరపాలని, తప్పిదాలకు బాధ్యులైన అధికారులు, సిబ్బంది లేదా ఇతరులపై శాఖాపరమైన, అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఈ వ్యవహారంపై స్వతంత్ర న్యాయ విచారణ లేదా సీబీఐ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలన్న డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలాగే 22(ఎ) జాబితాలో జరిగిన భారీ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.
అదేవిధంగా, రెవెన్యూ మంత్రి కుటుంబ కంపెనీకి ఫీనిక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ నుంచి జరిగినట్లు వస్తున్న భారీ స్థాయి ఆస్తుల బదిలీ ఆరోపణలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని గంట రవికుమార్ డిమాండ్ చేశారు.

### ప్రధాన డిమాండ్లు

- వరంగల్ జిల్లాలోని 22(ఎ) భూముల పూర్తి జాబితాను బహిర్గతం చేయాలి.
- గ్రామం-మండలం-సర్వే నంబర్ వారీగా వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి.
- 22(ఎ)లో జరిగిన చేర్పులు, తొలగింపులపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలి.
- డిజిటల్ భూ రికార్డులపై ఫోరెన్సిక్ ఆడిట్ చేపట్టాలి.
- తప్పుగా చేర్చిన భూములను గుర్తించి బాధితులకు న్యాయం చేయాలి.
- అక్రమాలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి.
- 22(ఎ) వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపించాలి.
- 22(ఎ) జాబితా తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి రాజీనామా చేయాలి.
- ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు బైరి మురళీకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు గడల కుమార్, జిల్లా కార్యదర్శి పోనుగోటి వెంకట్ రావు, జిల్లా నాయకులు గుర్రాల చంద్రమౌళి, వంచనగిరి రాజ్ కుమార్, శివ పాల్గొన్నారు.



## పెద్ది మరణంతో బీఆర్ఎస్ రాజకీయం

- **కేటీఆర్, హరీశ్ వల్లే సానుభూతి దెబ్బతింటోంది**
- **పెద్దికి మెరుగైన వైద్యం కోసం దొంతి సీఎంతో మాట్లాడారు**
- **సీఎంపై కొండా సుస్మిత వ్యాఖ్యలు సరికాదు**
- **తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి**

**హనుమకొండ, ఆయుధం:** మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర ఆయిల్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.
ఆయన మరణాన్ని రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారనే విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయని.. హరీశ్ రావు,కేటీఆర్ చేస్తున్న రాజకీయ ప్రచారం వల్ల సుదర్శన్ రెడ్డి కి రావాల్సిన సానుభూతి దెబ్బ తింటోందని అభిప్రాయం పడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''ఆయన మరణాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకుండా వాస్తవాలను ప్రజల ముందుంచాలి. దొంతి మాధవ్ రెడ్డి సహాయం చేశారని.. దొంతి మాధవ్ రెడ్డి సుదర్శన్ రెడ్డి మరణాన్ని రాజకీయంగా ఉపయోగించుకోలేదు. రోహిణి ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి తో మాట్లాడి గ్రీన్ కారిడార్ ఏర్పాటుకు సహకరించారు. చేసిన సహాయన్ని మార్చిపోయి దొంతి మాధవ్ రెడ్డి గారి ఫోటో తో brs పార్టీ నాయకులు శవయాత్ర చేశారు. దీన్ని brs పార్టీ నాయకులు కార్యకర్తలు తప్పుగా భావిస్తున్నారు.
కాజీపేట లో వైఎస్ఆర్ నగర్ కాలనీ ఏర్పాటు చేసిందే కాంగ్రెస్ పార్టీ వై ఎస్ ఆర్ నగర్ కాలనీలో ఉన్నటువంటి భూమిని ప్రభుత్వ భూమిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గుర్తించారు. వై ఎస్ ఆర్ నగర్ కాలనీ వాసులు నాయిని రాజేందర్ రెడ్డి దగ్గరికి వెళ్లి మమ్మల్ని కొంత మంది భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. నాయిని రాజేందర్ రెడ్డి స్పందించి మీ పై ఎవరైనా దాడి చేసినా, బెదిరించినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని మీకు ఇందిరమ్మా ఇండ్లు మంజూరు చేస్తా అని వారికి హామీ ఇచ్చారు. ఆ భూమిలో ప్రభుత్వ ఆసుపత్రి, డిగ్రీ కాలేజీ, బస్‌స్టాప్, ఏసీపీ కార్యాలయం వంటి ప్రజాప్రయోజన నిర్మాణాలు చేపట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత ప్రభుత్వ హయాంలో అప్పటి mla వినయ్ భాస్కర్ కాంట్రాక్టర్ ల తో లాలూచీ పడి సమయాన్నీ వృధా చేశాడని నేను గుర్తుచేస్తున్నాను. కాంగ్రెస్ (మిగతా 2లో..)

# మునుపెన్నడూ లేని విధంగా నియోజకవర్గం అభివృద్ధి

- ఉమ్మడి జిల్లాలోనే స్టేషన్ ఘనపూర్ కు అధిక నిధులు
- అత్యున్నత భద్రతా ప్రమాణాలతో డిజిటల్ రేషన్ కార్డుల జారీ....
- మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం....



**స్టేషన్ ఘనపూర్, ఆయుధం:** నియోజకవర్గానికి మంజూరు అయిన పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి హ్యామ్ రోడ్ల అభివృద్ధి పనులను సంవత్సరంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. రఘునాథపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రఘునాథపల్లి మండలానికి సంబంధించిన కొత్త డిజిటల్ రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్బంగా లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అత్యంత భద్రతా ప్రమాణాలతో జారీ చేసిన డిజిటల్ రేషన్ కార్డులను పంపిణి చేశారు.
అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..... రేషన్ బియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత భద్రతా ప్రమాణాలతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త డిజిటల్ రేషన్ కార్డులను పంపిణి చేస్తుందని తెలిపారు. రానున్న రోజులలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఈ డిజిటల్ రేషన్ కార్డుకు అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నో ఏళ్లుగా ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న విషయాన్నీ గుర్తించి రాష్ట్ర ప్రజలకు కొత్త రేషన్ కార్డులతో పాటు రేషన్ కార్డులలో కొత్తగా చేర్చాల్సిన కుటుంబసభ్యుల పేర్లను చేర్చి రేషన్ కార్డులు మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో పేద ప్రజలకు కడుపు నిండా అన్నం పెట్టాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. దేశంలో ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణి చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిణి చేస్తున్న కొత్త డిజిటల్ రేషన్ కార్డుల పైన ప్రధాని మోడీ ఫోటో పెట్టాలని బీజేపీ వాళ్ళు అంటున్నారని కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణి చేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి 13వేల 800కోట్ల రూపాయల ఖర్చుతో ప్రజలకు ఉచిత సన్న బియ్యం పంపిణి చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దేశం మొత్తం సన్న బియ్యం పంపిణి చేస్తే తప్పకుండ మోడీ ఫోటో పెడతామని స్పష్టం చేశారు.
స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే అత్యధిక పంచాయతీ రాజ్ రోడ్లు, నిధులు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గానికే మంజూరు అయ్యాయని అన్నారు. నియోజకవర్గంలో 23 పంచాయతీ రాజ్ హ్యామ్ రోడ్ల అభివృద్ధికి దాదాపు 300కోట్లు, అలాగే ఆర్ అండ్ బీ హ్యామ్ రోడ్ల అభివృద్ధికి 172కోట్లు మంజూరు అయ్యాయని వెల్లడించారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ హ్యామ్ కింద మంజూరు అయిన రోడ్ల అభివృద్ధి పనులను ఏడాదిలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. అలాగే రఘునాథపల్లి మండల కేంద్రంలో 220కేవి సబ్ స్టేషన్ నిర్మాణానికి త్వరలోనే 100కోట్లు మంజూరు కానున్నాయని, రఘునాథపల్లిలో 220కేవి సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తి అయితే రైతులకు, ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ప్రజలు నాకు ఇచ్చిన అవకాశాన్ని ఉపయోగించి నియోజకవర్గ అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పని చేసే వారిని ఎన్నుకుంటేనే అభివృద్ధి జరుగుతుందని, పనులు, పథకాలు, పదవులు అమ్ముకునే వారిని ఎన్నుకుంటే ఆగం అవుతామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రతీ పథకం అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడుతున్నాయని అన్నారు. పేద వర్గాల గురించి ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని తెలిపారు. రాష్ట్రంలో మొదటి సంవత్సరంలో 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్లు, ఇప్పుడు రెండో సంవత్సరం 2లక్షల 50వేల ఇల్లు మొత్తం 35వేల కోట్లతో 7లక్షల ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం చేసిన 8లక్షల కోట్ల అప్పుకు మిత్తిలు కడుతూ ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ కూడా గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తూనే 6గ్యారెంటీల అమలులో భాగంగా అనేక కొత్త పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం పంపిణి, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, 2లక్షల 50వేల కొత్త పెన్షన్లు, రైతు భరోసా వంటి అనేక సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని వెల్లడించారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల ఆశీర్వాదం ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, వివిధ గ్రామాల సర్పంచులు, తహసీల్దార్, ఎంపిడివో, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సీపీ

**హనుమకొండ, ఆయుధం:** మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ శుక్రవారం సందర్శించారు. ఉదయం శిక్షణ కేంద్రాన్ని చేరుకున్న పోలీస్ కమిషనర్ కు శిక్షణా కేంద్రం పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించడంతో పాటు వివిధ అంశాలపై శిక్షణకై వచ్చే పోలీస్ అధికారులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, తరగతి గదులను పరిశీలించి.. ఈ కేంద్రం విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఇతర సిబ్బంది పనితీరును సీపీ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ కమిషనర్ వెంట అదనపు డీసీపీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఇన్స్ స్పెక్టర్ రవికుమార్, ఆర్. ఐ సింహచలం శ్రీనివాస్, ఆర్. ఎస్. ఐ రవి తేజ తో పాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




## ట్రాఫిక్ రద్దీ నివారణకు ఫ్రీ లెఫ్ట్‌ల ఏర్పాటు

**వరంగల్, ఆయుధం:** వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ ఆదేశాల మేరకు, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ ఎల్అండ్ఓ రాయల ప్రభాకర్, ఏసీపీ ట్రాఫిక్ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో, కాజీపేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకన్న ఆధ్వర్యంలో ట్రాఫిక్ రద్దీ నివారణకు పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కాజీపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC) సహకారంతో అదాలత్ జంక్షన్‌లో మూడు వైపులా, ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో ఒక వైపు మొత్తం 54 సిమెంట్ బ్లాక్‌లను ఏర్పాటు చేసి ఫ్రీ లెఫ్ట్ మార్గాలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

## చంతయ్యపల్లిలో సమస్యల
# పరిష్కారానికి చర్యలు

(మొదటి పేజీ తరువాయి..)
భరోసా కింద 252 మంది రైతులకు రూ.1.52 కోట్లు విడుదలయ్యాయి. రైతు భీమా కింద ముగ్గురు రైతుల కుటుంబాలకు రూ.15 లక్షలు అందించారు. 14 స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల కింద రూ.1.56 లక్షలు విడుదలయ్యాయి. 17 స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ కింద రూ.87.69 లక్షలు విడుదలయ్యాయి. గ్రామంలో 6 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, నిర్మాణాలు పూర్తయ్యే దశలో ఉన్నాయి. రెండో దశలో మరిన్ని ఇళ్ల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. 93 కుటుంబాలకు మహాలక్ష్మి పథకం ద్వారా గ్యాస్ సబ్సిడీ అందుతోంది. గ్రామంలో 52 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి.

### ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహించాలి

గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగును విస్తరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ రైతులకు సూచించారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటల వైపు రైతులు దృష్టి సారించాలని కోరారు. ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలికంగా అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. "జల సిరి" పథకం కింద ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రభుత్వం రూ.6,500 సహాయం అందిస్తుందని తెలిపారు. పంట పొలాల్లో ఫామ్ పౌండ్లు నిర్మించుకుంటే రూ.1.30 లక్షల వరకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని చెప్పారు.

### గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేసి సాగునీరు అందిస్తాం

హుస్నాబాద్ నియోజకవర్గ రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి కాలువల ద్వారా నీరు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కాలువల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. "గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తి చేయకపోతే నేను ఓట్లు అడగను" అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.
ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. గతంలో మూతపడిన పాఠశాలను తిరిగి పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, గ్రామ ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అవసరమైతే నూతన పాఠశాల భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ నెల 31వ తేదీ వరకు పెన్షన్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, బోదకాలు, తలసేమియా, హెచ్ఐవీ తదితర అర్హత కలిగిన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూక్యా సునీత , జిల్లా అధికారులు, మండల అధికారులు,గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

## ఉచిత ఆర్థోపెడిక్ ఆరోగ్య శిబిరం

**వరంగల్, ఆయుధం:** ఆర్యవైశ్య సత్రము, రామన్నపేట, వరంగల్ అధ్యక్షులు గట్టు మహేష్ బాబు, గంపా అమర్ నాథ్, పడిశాల నాగరాజ్, వాసవి హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు మాదారపు రాజేశ్వర్, గందె గోవింద రాజులు, తొనుపునూరి అశోక్ కుమార్, కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన హెల్త్ క్యాంపుకు శ్రీకర హాస్పిటల్, హైద్రాబాద్ వారు డా॥ అఖిల్ దాడి గారు స్వయంగా పాల్గొన్నారు,వారితో పాటు డా॥ శివకుమార్ కోటా, డా॥ అన్వేష్ గౌడ్ కూడా పాల్గొన్నారు. సుమారు ఈ క్యాంపులో 300 మంది పేషేంట్కు ఆర్థోపెడిక్ పరీక్షలు నిర్వహించి వారికి సలహాలు, ఉచితముగా మందులు కూడా ఇవ్వడము జరిగినది. హాజరయిన పేషంట్స్ ఈ రోజు ఎంతో విశేషముగా భావిస్తూ ఇంత మంచి సామాజిక సేవను ఏర్పాటు చేయడము చాలా సంతృప్తి పొందుతూ నిర్వాహకులు అందరికి శుభాకాంక్షలు ధన్యవాదములు తెలిపినారు. డా॥ అఖిల్ దాడి, వారి బృందమునకు తమ యొక్క అమూల్యమైన సమయమును వరంగల్ ప్రజలకు అందించిన సందర్భముగా మరియు నిర్వాహకులు గట్టు మహేష్ బాబు, గంపా అమర్ నాథ్ , పడిశాల నాగరాజ్, మాదారపు రాజేశ్వర్ రావు, గందె గోవిందరాజులు, టి.అశోక్ కుమార్ అందరు అభినందనలు తెలిపినారు.




# నర్సంపేటలో డీఎంహెచ్ఓ తనిఖీలు

- ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలతో సమీక్ష



**వరంగల్, ఆయుధం:** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. బి. రాజారెడ్డి శుక్రవారం నర్సంపేటలోని టిహబ్ను సందర్శించి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు, సేకరించిన నమూనాలు, నమూనాల సేకరణ సమయం, సేకరించిన నమూనాలు టిహబ్‌కు చేరుతున్న సమయం తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షా నమూనాల సేకరణ మరియు రవాణా ప్రక్రియలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నర్సంపేట పి పి యూనిట్ లో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, ఆశా కార్యకర్తలతో మాట్లాడారు. వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన పనితీరు సూచికలను సమీక్షించి, అన్ని ఇండికేటర్లలో మెరుగైన పనితీరు సాధించేలా క్షేత్రస్థాయిలో సేవలను మరింత సమర్థవంతంగా అందించాలని సూచించారు. ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల సేవలు చేరేలా కృషి చేయాలని ఆదేశించారు.
తదుపరి నర్సంపేటలోని ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు మరియు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (IMA) సభ్యులతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్, 2011 మరియు సంబంధిత రూల్స్-2022 అమలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. బి. రాజారెడ్డి మాట్లాడుతూ, ప్రతి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ తప్పనిసరిగా చట్టం మరియు నిబంధనలను పాటించాలని తెలిపారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, వాటికి సంబంధించిన టారిఫ్ వివరాలను స్పష్టంగా ప్రదర్శించే బోర్డులను రిసెప్షన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు, ధరలు మరియు ఇతర అవసరమైన వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు.
క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో రోగులకు నాణ్యమైన, పారదర్శకమైన వైద్య సేవలు అందేలా సంబంధిత నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని, నిబంధనలను ఉల్లంఘించే పరిస్థితులు తలెత్తకుండా ఆసుపత్రుల యాజమాన్యాలు ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సూచించారు. ఈ కార్యక్రమంలో డా. ప్రకాష్, డి ఐ ఓ /డిప్యూటీ డి ఎం ఎచ్ ఓ, ఎస్ ఓ ప్రసన్న కుమార్, ఎల్ డి కంప్యూటర్ వెంకటేశ్వర్లు, నాగరాజు, సంబంధిత వైద్యాధికారులు, సిబ్బంది, ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు మరియు ఐ ఎం ఎ సభ్యులు పాల్గొన్నారు.

# వయో వృద్ధుల సంక్షేమమే మా లక్ష్యం

- డి. ఎల్. ఎస్. ఏ. ఇంచార్జ్ సెక్రటరీ జడ్జి రామలింగం, ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ -డాక్టర్ అనితా రెడ్డి




**హనుమకొండ, ఆయుధం:** ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా పరిషత్తు కార్యాలయం లోని వృద్ధుల డే కేర్ సెంటర్ నందు మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డి. ఎల్. ఎస్. ఏ. సెక్రటరీ రామలింగం, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి , డి. డబ్బు. ఓ విశ్వజ పాల్గొన్నారు. ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధుల చట్టాల పై అవగాహన కల్పించారు అనంతరం వారు మాట్లాడుతూ, వయో వృద్ధుల సంక్షేమమే తమ లక్ష్యము అని అలాగే ట్రిబ్యునల్ బెంచ్ వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుంది అన్నారు వివిధ వృద్ధాశ్రమాలలో ఉన్న వారు తమకు ఎవరు లేరని, ఒంటరి వారిమనే దిగులు చెందవద్దని, వృద్ధులకు చేయూత నివ్వడానికి అందరం ఉన్నామని అన్నారు. నేటికాలంలో వయోవృద్ధులను వేధించడం, మరియు నిర్లక్ష్యం చేయడం అనేది ఎక్కువగా జరుగుతుందని ఈ విషయం బయట ప్రపంచానికి చెప్పలేని సమస్యగా రూపుదాల్చిందని ఆవేదన వెలిబుచ్చారు,వయో వృద్ధుల పట్ల సానుభూతి తో కాకుండా సహానుభూతితో చర్యలు అందించాలని కోరారు వేధింపులకు గురైన వయో వృద్ధులు తగు సలహా పునరావాసం నిమిత్తం 14567 టోల్ ఫ్రీ నంబర్ల లో సంప్రదించాలని కోరారు, పిల్లలకు ఆస్తి తమ తదనంతరం ఏ ఇవ్వాలని, ముందుగా ఇవ్వడం ద్వారా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు, తల్లిదండ్రుల పోషణ బాధ్యత కచ్చితంగా పిల్లలదేనని తల్లిదండ్రులను ఇబ్బంది పెడితే చట్ట ప్రకారం శిక్ష తప్పదని అతిథులు అన్నారు, అనంతరం ఈ సందర్భంగా వయో వృద్ధులకు పండ్లు పంపిణీ చేసారు, జడ్జి రామలింగం, డాక్టర్ అనితా రెడ్డి, విశ్వజ, బార్ అసోసియేషన్ సెక్రటరీ, యుగెందర్, దామోదర్, దేవాచారి, శ్రీనివాస్ రావు,డాక్టర్ ఉష, ఉమ, వయోవృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

# 5 రోజుల బ్యాంకింగ్ కోసం మెగా వాక్ థాన్

- హనుమకొండ నుండి హైదరాబాద్ వరకు 150 కిలో మీటర్ల మహా పాదయాత్ర




**హనుమకొండ, ఆయుధం;** బ్యాంకింగ్ రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది ఉద్యోగులు, అధికారుల చిరకాల ఆకాంక్ష అయిన 5 రోజుల బ్యాంకింగ్ సాధన కోసం సిబిఓఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా పాదయాత్ర శుక్రవారం హనుమకొండలో ప్రారంభమైంది. బ్యాంకర్లు హక్కులు, కుటుంబ సంక్షేమం, మెరుగైన పని వ్యక్తి గత జీవన సమతుల్యత కోసం నిర్వహిస్తున్న ఈ మహా పాదయాత్రకు బ్యాంకింగ్ వర్గాల నుంచి విశేష స్పందన లభిస్తుంది. "ప్రతి అడుగు 5 రోజుల బ్యాంకింగ్ కోసం... ప్రతి అడుగు బ్యాంకర్ల భవిష్యత్తు కోసం" అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ వాక్ థాన్ లో హనుమకొండ నుంచి హైదరాబాద్ వరకు సుమారు 150 కిలోమీటర్ల దూరాన్ని బ్యాంకు అధికారులు, ఉద్యోగులు, నాయకులు, మద్దతుదారులు కలిసి నడవనున్నారు.
హనుమకొండ నుంచి హైదరాబాద్ వరకు ఉద్యమ పయనం
తెలంగాణలోని హనుమకొండ నుంచి ప్రారంభమయ్యే ఈ మెగా వాక్ థాన్ వివిధ ప్రాంతాల మీదుగా హైదరాబాద్ వైపు సాగనుంది. మార్గంలో బ్యాంకర్లు, ప్రజలు, వివిధ వర్గాల ప్రతినిధులను కలుస్తూ 5 రోజుల బ్యాంకింగ్ అవసరాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం ఇది కేవలం ఒక పాదయాత్ర కాదు, బ్యాంకర్ల హక్కు కోసం చేపట్టిన ప్రజా ఉద్యమం. ప్రతి అడుగు ఒక సందేశాన్ని మోస్తుంది, ప్రతి కిలో మీటర్ బ్యాంకర్ల అకాంక్షను ప్రతిబింబిస్తుంది ప్రతి పాలోనేవారు 5 రోజుల బ్యాంకింగ్ కోసం తమ గళాన్ని మరింత బలంగా వినిపించనున్నారు. సీబీవోఏ ప్రధాన కార్యదర్శి రవికుమార్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ లింగారెడ్డి మార్గదర్శకత్వంలో రవి కేలోత్, విక్రం రాజ్, ప్రసాద్, రామకృష్ణ, రమేష్, సాయి ప్రసాద్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్ది మరణంతో బీఆర్ఎస్ రాజకీయం

(మొదటి పేజీ తరువాయి..)
ప్రభుత్వం ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతోంది. నాయిని చేస్తున్న అభివృద్ధిని కొందరు ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ముందుకు సాగుతున్నారు.

### సీఎంపై వ్యక్తిగత విమర్శలు సరికాదు

కొండ సుష్మిత సీఎం రేవంత్ రెడ్డి పై, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల పట్ల జంగా రాఘవరెడ్డి తప్పు పట్టారు. పూర్తి సమాచారం లేకుండా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఈ వ్యవహారంపై మంత్రి కొండా సురేఖ కూడా తనకు తెలియకుండా ఆ వ్యాఖ్యలు జరిగాయని వివరణ ఇచ్చారని అన్నారు. రాజకీయాలు ఉండాలి కానీ వ్యక్తిగత విమర్శలు,తప్పుడు ప్రచారం ఉండకూడదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారానికి బదులుగా వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు. అభివృద్ధి,ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. నర్సంపేట,వరంగల్ ప్రాంత ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకుంటారని నాకు పూర్తి నమ్మకం ఉందని జంగా అన్నారు.

### నా టార్గెట్ రేవంత్ రెడ్డి.. కాంగ్రెస్ పార్టీ కాదు....



నేను కాంగ్రెస్ పార్టీని విమర్శించలేదు, రేవంత్ రెడ్డిని విమర్శించాను రాహుల్ గాంధీ, సోనియా గాంధీ అంటే నాకు గౌరవం ఉంది. కానీ ఇక్కడ రేవంత్ రెడ్డి, అతని సోదరులు విపరీతమైన అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. అందుకే అతన్ని టార్గెట్ చేశాను. ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించడానికి అతనికి ఏం అధికారం ఉంది? నేను ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నాను

**– కొండా సుష్మిత**

## చీర భరత్ కుమార్ కు మదర్ థెరిసా అవార్డు



**వరంగల్, ఆయుధం:** వరంగల్ నగరం 40 వ డివిజన్ లోని ఉరుసు ప్రాంతానికి చెందిన చీర భరత్ కుమార్ సామాజిక సేవలో మరియు జర్నలిజంలో ముందుంటూ ప్రజల సమస్యలపై ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ అనేక సమస్యల పరిష్కారానికి తన కలంతో వార్త కథనాలతో ప్రజలను చైతన్యవంతులను చేస్తూ ప్రభుత్వ అధికారులు చేసే తప్పిదాలను ఎప్పటికప్పుడు వార్త కథనాలతో ఎండగడుతూ ఎంతో మందికి ఆదర్శంగా నిలిచిన ఈ శుభ సందర్భాన వారికి మదర్ తెరిసా, మెగాస్టార్ చిరంజీవి జన్మదినం సందర్భంగా మదర్ థెరిస్సా అవార్డు ను ప్రకటించినప్పుడు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ వారి సౌజన్యంతో సకల కళా సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకొని మదర్ తెరిసా మెగాస్టార్ చిరంజీవి జన్మ దినోత్సవ సంబరాలు 2026 నిర్వహిస్తున్నట్లు కార్యక్రమంలో గడ్డం సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22న రాజశ్రీ గార్డెన్, శాంతినగర్, వరంగల్ లో ఈ అవార్డును ఇస్తున్నట్లు తెలిపారు.

## నేడు నేటి సరఫరా బంద్

**వరంగల్, ఆయుధం:** ధర్మసాగర్ 60 ఏం ఎల్ డి వ్యవస్థలో సాంకేతిక సమస్య వల్ల వరంగల్ పరిధి లోని పలు ప్రాంతాల్లో నేడు (శనివారం) నీటి సరఫరా ను నిలిపి వేస్తున్నట్లు బల్దియా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సంతోష్ బాబు నేడోక ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సాంకేతిక సమస్య వల్ల వరంగల్ పరిధి లోని కరీమాబాద్ ప్రాంతం లో ఒక రోజు (శనివారం) నీటి సరఫరా ను నిలిపి వేయడం జరుగుతుందని ఆయా ప్రాంతాల వాసులు ఇట్టి విషయాన్ని గమనించి బల్దియా కు సహకరించాలని ఈ ఈ కోరారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695